క్లుప్తంగా

నున్నలో రక్తదాన శిబిరం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కళాశాల జాతీయ సేవా సమితి ఆధ్వర్యాన గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ ఎస్. సత్యనారాయణరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రక్తదానం చేసిన వారిని రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ అభినందించారు.

కోర్టుకు హాజరైన వంశీమోహన్



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గురువారం స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన స్థల వివాదం కేసులో బెయిల్ షరతుల మేరకు ఆయన కోర్టుకు హాజరై సంతకం చేశారు. అనంతరం కోర్టు బయటకు వచ్చిన ఆయనను నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు.

175 మందికి కంటి పరీక్షలు



గన్నవరం రూరల్: విద్యార్థులు కంటి చూపును సంరక్షించుకోవాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 175 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆప్తమాలజిస్ట్ కొండలరావు విద్యార్థులను పరీక్షించి 135 మందికి కళ్లజోళ్లు సిఫారసు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. ఆకుకూరలు, ప్రొటీన్‌లు తీసుకోవడం ద్వారా కళ్లను, ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని చెప్పారు. ఏఎన్ఎం బి.జ్యోతి, గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ కోచ్ అంజిబాబు హఠాన్మరణం



హనుమాన్‌జంక్షన్ రూరల్: మూడున్నర దశాబ్దాలుగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో విశేష సేవలు అందించిన హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ కోచ్, పవర్ కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వజ్రె అంజిబాబు(55) హఠాన్మరణం చెందారు. బాపులపాడు మండలం రామన్నగూడెంలోని ఆయన స్వగృహంలో గురువారం ఉదయం గుండెపోటుతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్య పరీక్షలు చేయించగా, అప్పటికే ప్రాణాలు విడిచినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంజిబాబుకు ఇటీవలే నేషనల్ స్టార్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఆయన అకాల మరణం పట్ల సంతాపం తెలుపుతూ హీరో సుమన్ ఓ ప్రత్యేక వీడియో విడుదల చేశారు.

చినకంచిలో మాస శివరాత్రి పూజలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం చినకంచిలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీచంద్రమౌళీశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేషపూజ, పంచహారతుల సేవ జరిగింది. వేదపాఠశాల విద్యార్థులు కటకాలు పారాయణ చేశారు. శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మాసశివరాత్రి సందర్భంగా నందీశ్వరుని పూజ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కిక్కే.. కిక్కు

- తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా 16 బార్‌లకు నోటిఫికేషన్
- ఇప్పటికే అందుబాటులో నాలుగు వైన్ షాపులు
- పెనమలూరులో మరో ఐదు షాపులు
- నిబంధనలు పాటించని వైనం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి మాట ఎలా ఉన్నా మద్యం ప్రియులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 16 బార్‌లకు అనుమతులు ఇచ్చింది. ఇప్పటికే ఇక్కడ వైన్ షాపుల్లో విచ్చలవిడిగా పగలనక రాత్రనక మద్యం అమ్మకాలతో మందుబాబులకు కిక్ ఎక్కించి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా బార్ షాపులకు అనుమతులు ఇవ్వడంతో గ్రామాల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీలో ప్రస్తుతం 10 బార్‌లు ఉన్నాయి. ఈ నెలాఖరుకు వాటి గడువు ముగుస్తుంది. దీంతో ప్రభుత్వం కొత్తగా బార్‌లకు నోటిఫకేషన్ ఇచ్చింది. మొత్తం 16 బార్‌లకు అనుమతులు ఇవ్వగా అందులో కల్లుగీత కులాలకు 2, మిగితా 14 షాపులు ఇతరులకు కేటాయించింది. లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ. 55 లక్షలుగా నిర్ణయించింది. దరఖాస్తు రుసుము రూ. 5 లక్షలుగా ప్రకటించి ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు చొప్పున వేస్తేనే పరిగణలోకి తీసుకుంటామని జీవోలో స్పష్టం చేసింది.

28న లాటరీ

కాగా గతంలో బార్‌షాపుల విషయంలో వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తులు వేయడంతో లైసెన్స్ ఫీజు రూ.కోటి వరకు కట్టారు. గతంలో రూ. 50 లక్షలు మాత్రమే ఉంది. వైన్ షాపుల పుణ్యమా అని వ్యాపారంలో నష్టం వచ్చిందని వారు చెబుతున్నారు. దీంతో ఇప్పుడు వైన్ షాపులు ఉన్నందును బార్ నిర్వాహకులు రింగ్ అయ్యి దరఖాస్తులు వేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ నెల 26వ తేదీ దరఖాస్తుకు గడువు ఉండగా, 28న లాటరీ తీస్తారు.

20కి పైగా మద్యం షాపులు

తాడిగడప మున్సిపాలిటీలో ఇక ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు కనబడనున్నాయి. తాడిగడప పరిధిలో ఇప్పటికే నాలుగు వైన్ షాపులు ఉన్నాయి. దీనికి తోడు తాజాగా మరో 16 బార్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మొత్తం 20 మద్యం షాపులు అవుతాయి. తాడిగడప మున్సిపాలిటీలో యనమలకుదురు, తాడిగడప, పోరంకి, కానూరు నాలుగు సర్కిల్స్ ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి ప్రాంతంలో పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులోకి వస్తుంది.

బెల్ట్ తీయరా..

బెల్ట్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నాయి. బెల్ట్ షాపుల్లో బాహాటంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలలు, గుడులు ఉన్న ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలో రేషన్ షాపులకు పోటీగా మద్యం షాపులు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెనమలూరులో ఆగని దందా

పెనమలూరు మండలంలో ఐదు వైన్ షాపులు దారుణంగా మద్యం విక్రయాలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా గాలికొదిలి నిత్యం మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పైగా 20 వరకు బెల్ట్ షాపులను కూడా నిర్వహిస్తున్నారు. తాడిగడప, పెనమలూరు పరిధిలో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. ఇక్కడ ఎటువంటి చట్టాలు అమలు జరగడం లేదు. మద్యం సేవించిన వారు వాహనాలతో అనేక ప్రమాదాలు చేసినా చర్యలు శూన్యం. రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలతో సమస్యలు తలెత్తుతున్నాయి.

ఎరువుల కేంద్రం ప్రారంభం



ఎరువుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ బాలకోటేశ్వరరావు తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం పరిధిలోని ఎనికేపాడు గ్రామంలో గురువారం ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గోగం వెంకట బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కేంద్రంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, నానో యూరియా రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. తక్కువ ధరకు సొసైటీ తరుపున ఎరువుల అమ్మకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ ఎరువుల కేంద్రాన్ని పక్క గ్రామాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు రైతులు కూడా సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు పొలిశెట్టి గోపాలరావు, జనపాల శ్యామలరావు, సీఈవో జగదీశ్, ఆర్ఎస్‌కే వీఏఏ గోపిరాజు, నాయకులు కోనేరు వెంకటనారాయణ, కోనేరు సందీప్, నభిగాని కొండా తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. మాది రైతు ప్రభుత్వం, రైతులకు అండగా ఉంటామని చెప్పే అధికార పార్టీకి చెందిన నాయకులు అవసరాలకు మించి యూరియాను దొడ్డి దారి నుంచి తీసుకెళ్లడంతో క్యూలో రైతులకు ఎరువులు అందలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నున్న గ్రామంలో వెయ్యి ఎకరాలు ఈ క్రాప్ నమోదు కాగా యూరియా 3,400 బస్తాలు విక్రయాలు జరిగాయి. ఎకరానికి మూడు బస్తాల చొప్పున విక్రయాలు జరపాల్సి ఉండగా అంతకంటే అధికంగా యూరియా అమ్మకాలు ఎలా జరిగాయనేది రైతుల ప్రశ్న. ఇదెలా సాధ్యమవుతుందని రైతులు ప్రశ్నిస్తుంటే వ్యవసాయశాఖ అధికారులు, సొసైటీ సిబ్బంది నుంచి సమాధానం లేదు. ఆధార్‌కార్డుతో వచ్చిన రైతులకు ఎకరాకు మూడు బస్తాల యూరియా ఇవ్వాల్సి ఉండగా ఒక్క బస్తా కూడా అందలేదని రైతులు వాపోతున్నారు. గత జగనన్న పాలనలో ఖరీఫ్ పంట సాగుకు అవసరమైన ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో పుష్కలంగా ఉండేవని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎరువుల కొరత ఏర్పడిందని రైతులు అంటున్నారు. బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిస్తున్నారని రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



కానూరులో ప్రసంగిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

పెనమలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు చాలా అవసరమని జేఎన్‌టీయూ కాకినాడ పూర్వ వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం 'క్యాంపస్ టు కెరీర్ లైఫ్ స్కిల్స్ ఇంజినీరింగ్ నీడ్స్ 'అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంత జ్ఞానవంతులు ఎంత ప్రతిభావంతులు అన్నది కాదని.. ఈ రెండు నైపుణ్యాలు కలిపి అంకిత భావంతో పని చేస్తే జీవితంలో రాణిస్తారన్నారు. ప్రపంచాన్ని ముందుకునడిపే సత్తా ఇంజినీర్లకు ఉందని తెలిపారు. వివిధ ఇంజినీరింగ్, జీవిత నైపుణ్యాలు సాధించడానికి కష్టపడాలని సూచించారు. విద్యార్థులు సామాజిక నైపుణ్యం, నిజాయతీ, ఇతరుల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

గన్నవరం డీఎస్పీ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా వినాయక చవితి ఉత్సవ మండపాల వద్ద డీజే సౌండ్, బాణాసంచా కాల్పులు పూర్తిగా నిషేధమని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ముందస్తుగా తగిన అనుమతులు పొందాలని సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని చెప్పారు. మత, రాజకీయ వివాదాలను రేకెత్తించే బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఉత్సవ మండపాల వద్ద ఖచ్చితంగా కమిటీ సభ్యులు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జన ప్రక్రియ రాత్రి తొమ్మిది గంటలలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న సంబంధిత ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యులవుతారని హెచ్చరించారు.

అనుమతి తప్పనిసరి

గన్నవరం: వినాయక చవితి ఉత్సవాల్లో కమిటీలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పాటు కావాలని అన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవ పందిరి, మైకులు ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్ల ద్వారా డీఎస్పీ అనుమతి తీసుకోవాలని, నిమజ్జన ఊరేగింపునకు "గణేష్ ఉత్సవ్" వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల తర్వాత కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెవిటి, మూగ దివ్యాంగులకు ఉచితంగా టచ్ ఫోన్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెవిటి, మూగ దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా టచ్ ఫోన్లు పంపిణీ చేయనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా 18 ఏళ్లు నిండిన చెవిటి, మూగ దివ్యాంగులకు వీటిని ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి, కుటుంబ ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత దరఖాస్తు ఫారాలను జిల్లా కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గ్రామాల్లో గణేష్ ప్రతిమల సందడి



కంకిపాడు: వినాయక చవితి పర్వదినానికి ముందు నుంచే గ్రామాల్లో గణేష్ విగ్రహాల సందడి మొదలైంది. ఆయా పందిళ్ల వద్ద కొలువుదీరనున్న మూర్తులను నిర్వాహక ప్రతినిధులు అట్టహాసంగా ఊరేగించి చలువ పందిళ్ల వద్దకు చేరుస్తున్నారు. డీజేలు మోగిస్తూ, డప్పు వాయిద్యాలు, టపాసులు పేల్చి యువత సందడి చేస్తున్నారు. అయితే టపాసులు భారీగా కాల్చడం, డీజే సౌండ్స్ విపరీతంగా ఉండటంతో పట్టణ వాసులు భీతిల్లిపోతున్నారు. వీటిని అధికారులు ఏ మేరకు నియంత్రిస్తారో వేచిచూడాలి.

నేడు ఔత్సాహిక యువతకు అవగాహన సదస్సు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుంటూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారికి శుక్రవారం తమ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ ఆవరణలో శుక్రవారం ఉదయం 11.30కు సదస్సు ప్రారంభమవుతుందని తెలియజేశారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం, ఇండస్ట్రియల్ ప్రొమోషనల్ ఆఫీసర్ ఎస్‌వీ.సత్యనారాయణ పాల్గొని అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

జాతీయ రహదారిపై మురుగునీరు



కానూరు వీఆర్ సిద్ధార్థ ప్రధాన గేటు ఎదురుగా రోడ్డుపై మురుగునీరు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పాలన అస్తవ్యస్తంగా మారింది. కానూరులో గురువారం కాంట్రాక్టర్ తన అవసరాలకు డ్రెయినేజీలోని మురుగునీరును మోటర్ పెట్టి నేరుగా విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపైకి వదిలాడు. దీంతో రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులతో పాటు ఇంజినీరింగ్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళితే.. సాయిబాబా గుడి ప్రాంతంలో డ్రెయినేజీ పనులు చేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు మురుగునీరు అడ్డుగా ఉన్నాయని మోటర్ పెట్టి ఆ నీటిని జాతీయ రహదాని పైకి వదిలాడు. దీంతో రహదారి ప్రాంతమంతా మురుగునీరు మయంగా మారింది. మురుగునీరు నేరుగా వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రధాన గేటు వద్దకు వచ్చి పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దీంతో కాలేజీ విద్యార్థులు మురుగునీటితో తీవ్ర ఇబ్బంది పడ్డారు. తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి మాట ఎలా ఉన్నా ప్రజలు మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన రహదారిలో ట్రాఫిక్

కానూరు గ్రామ ప్రధాన రహదారిలో గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కానూరు ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. తాజాగా డ్రెయిన్ పనులను నత్తనడకన పనులు చేయడంతో కొత్తగా మరో సమస్య తలెత్తింది. రోడ్డు పక్కనే మట్టి గుట్టలు వేయడం, కాంట్రాక్టర్ వాహనాలు రోడ్డు పక్కనే నిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. గ్రామంలో గురువారం ఈ కారణాలతో కెనడీ స్కూల్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. చాలా సమయం వాహనాలు కదలలేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఒక్క పోలీసు కూడా ఇక్కడికి రాలేదు. పోలీసులు ట్రాఫిక్‌ను పూర్తిగా వదిలేసి నిర్లక్ష్యం ఉండటంతో తరచూ కానూరు రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా పోలీసులు ట్రాఫిక్ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కానూరులో నిలిచిన ట్రాఫిక్

ఆఖరి మజిలీకి అవస్థలు



శ్మశానం మొత్తం పేరుకుపోయిన ముళ్లకంపలు, పిచ్చి చెట్లు

- అధ్వానస్థితిలో ఎస్సీ శ్మశానవాటిక
- శ్మశానం చుట్టూ చెత్త డంపింగ్
- ఇబ్బందులు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానవాటిక పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. నగరానికి ఆనుకుని ఉన్న మేజర్ పంచాయతీలోని ఎస్సీ శ్మశానవాటికకు పట్టిన దీనస్థితిని మాత్రం ఎవ్వరూ మార్చలేకపోతున్నారు. నగరానికి ఆనుకుని ఉన్న గ్రామం కావడంతో రోజు రోజుకూ జనాభా పెరుగుతున్నారు. కాని ఈ శ్మశానవాటిక మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ శ్మశానవాటికలో ముళ్లకంపలు, పిచ్చిచెట్ల పెరిగిపోయాయి. విజయవాడరూరల్ మండలంలో జంట గ్రామాలుగా పేరున్న రామవరప్పాడు, ప్రసాదంపాడులకు ఉన్న ఒకే ఒక ఎస్సీ శ్మశానవాటిక ఇది. ఈ రెండు గ్రామాల్లో కలిపి వేల సంఖ్యలో ఎస్సీలు ఈ శ్మశానంపైనే ఆధారపడి ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ శ్మశానం బాగోగులు ఎవ్వరికి పట్టకపోవడంతో ఆఖరి మజిలీలో అవస్థలు తప్పడం లేదు.

ముళ్ల కంపలు, పిచ్చిచెట్లతో నిండిన వైనం

ఈ శ్మశానవాటికలో అడుగు తీసి అడుగు వేయలేనంతగా పిచ్చిమొక్కలు పెనవేసుకుపోయాయి. మృతదేహాలకు మట్టి చేయడానికి వీలు లేకుండా శ్మశానం మొత్తం ముళ్ల కంపలు, పిచ్చి చెట్లతో నిండిపోయింది. అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని ముళ్ల చెట్లు తొలగించి, చుట్టూ ప్రహరి నిర్మించాలని పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకూ పట్టించుకోలేదని ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమాధులు నిర్మించుకునేందుకు కూడా వీలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే

ఈ ప్రాంతంలో శ్మశానం చుట్టూ చెత్త డంపింగ్, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడిన కూడా శ్మశానవాటిక లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా చిత్తడిగా మారుతుంది. వర్షాలు పడే సమయంలో అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సి వస్తే వారి బాధ వర్ణనాతీతం. రామవరప్పాడు పంచాయతీ ఆధ్వర్యంలో నిత్యం ఈ శ్మశానవాటిక చుట్టూ చెత్తను డంప్ చేస్తున్నారు. గ్రామంలోని చెత్తనంతటినీ ట్రాక్టర్లతో తీసుకొచ్చి శ్మశానంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా కుప్పలుగా పోస్తున్నారు. గతంలో ఈ శ్మశానవాటిక వద్ద చెత్త డంప్ చేయొద్దని ఆందోళనలు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక పక్క కుప్పలుగా పేరుకుపోతున్న చెత్త, మరోవైపు కుళ్లిన వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చిన వారు ముక్కు మూసుకుని కార్యక్రమం ముగించాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టి వేయడానికి వచ్చిన వారు చెత్త, బురదలోనే పట్టలు పరుచుకుని ఆఖరి మజిలీ పూర్తి చేసుకుంటున్నారు. ఈ శ్మశానవాటికను అభివృద్ధి పరచాలని ఇరు గ్రామ ప్రజలు అధికారులు, పాలకులకు మొరపెట్టుకుంటున్నారు.

తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు

గత నెల ప్రసాదంపాడు పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ దృష్టికి ఈ శ్మశానవాటికతో పడుతున్న ఇబ్బందులపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికకు కనీసం ప్రహరీ లేదని, ముళ్లకంపలు పేరుకుపోవడం వల్ల అంత్యక్రియలు నిర్వహించుకునే వీలులేకుండా పోయిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనీసం శ్మశానవాటికలో షెడ్డు, నీటి వసతి, అంతిమ సంస్కారాలకు వచ్చే వారికి కనీస మౌలిక వసతులు కూడా లేవని ఏకరువు పెట్టారు. పిచ్చిమొక్కలు తొలగించి ప్రహరీ నిర్మించాలని, వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరారు. అయితే ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

అక్టోబర్ 5న ఏకపాత్రాభినయ పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీరామకృష్ణా నాట్యమండలి(సాంస్కృతిక సేవా సంఘం) 50వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కొత్తా పూర్ణానందం కళావేదికగా జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పౌరాణికం, సాంఘికం, చారిత్రక అంశాలను పోటీదారులు ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో రంగస్థల ప్రముఖులు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, డాక్టర్ జొన్నలగడ్డ జగన్మోహనరావు, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రవేశరుసుము లేదని ఎవరైనా ఉచితంగా పాల్గొనవచ్చునని చెప్పారు. పేర్ల నమోదుకు చివరితేదీ అక్టోబరు 2 అని, ఇతర వివరాలకు 85006 42543, 83747 60657 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ఆదిభట్ల జయంత్యుత్సవాలు



హరికథా గానం చేస్తున్న వై.వెంకటేశ్వర్లు

విజయవాడ కల్చరల్: ఆదిభట్ల నారాయదాసు శిష్యప్రశిష్య బృందం, అన్నమయ్య పరివారం, ఫ్లాంజేరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంతి ఉత్సవాల సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం నాటి కార్యక్రమాలను వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తి ప్రారంభించారు. హరికథా మహోత్సవాల్లో భాగంగా తిరుపతికి చెందిన నాగరాణి శ్రీనివాస కల్యాణం, వై.వెంకటేశ్వర్లు ద్రౌపదీ మానసంరక్షణ, పసుపులేటి శివకుమారి సుభద్రా కల్యాణం, విజయవాడకు చెందిన బుర్రా నరసింహశర్మ భక్తరామదాసు కథలను సంగీత, సాహిత్యాలను మేళవిస్తూ వినిపించారు. నిర్వాహకుడు బుర్రా పద్మనాభం, వైవీ కృష్ణయ్య పర్యవేక్షణలో సంప్రం కృష్ణమూర్తి, మద్దెల సాయిబాబులను ఆత్మీయంగా సత్కరించారు.